క్లుప్తంగా

మెరుగ్గా రెవెన్యూ సేవలు



సిబ్బందితో సమావేశం నిర్వహిస్తున్న తహసీల్దార్ బాలమురళీకృష్ణ

పాలకొండ : ప్రజలకు రెవెన్యూ సేవలు మరింత మెరుగ్గా అందించాలని తహసీల్దార్ బాల మురళీకృష్ణ అన్నారు. గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వీఆర్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ లక్ష్యం మేరకు సేవలు అందించాలని సూచించారు. సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఆయనతో పాటు డీటీ సన్యాసిరావు, ఆర్ఐ పుష్ప ఉన్నారు.

రోడ్డులో దిగబడిన లారీ



గోతిలో కూరుకుపోయిన లారీ

భామిని: మండలంలోని బిల్లుమడ – నులకజోడు గ్రామాల మధ్య ఏబీ రోడ్డుపై గురువారం ఉదయం ఓ లారీ గోతిలో దిగబడింది. ఒడిశా నుంచి ఇసుకతో వస్తున్న లారీ గోతిలో కూరుకుపోవడంతో రెండువైపులా వాహనాలు నిలిచిపోయాయి. దీంతో గంటల తరబడి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

విద్యార్థులకు దుస్తుల వితరణ



విద్యార్థులకు దుస్తులు అందజేస్తున్న స్కూల్ కమిటీ చైర్మన్ భారతి, తదితరులు

కొమరాడ: స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని మాదలింగి పంచాయతీ చీడిపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యుడు బోటు రామకృష్ణ గురువారం విద్యార్థులకు నూతన దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు రాగాల శ్రీనివాసరావు మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు సాయం చేస్తే తృప్తి కలుగుతుందన్నారు. కార్యక్రమంలో స్కూల్ కమిటీ చైర్మన్ భారతి ఉన్నారు.

ఆర్థిక సాయం..



ఫణిధర్ కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

పాలకొండ రూరల్: విద్యుత్ షాక్‌తో కాళ్లు, చేతులు కోల్పోయిన మంగళాపురం పంచాయతీ కార్యదర్శి ఫణిధర్‌కు రావెళ్ల ఫౌండేషన్ సభ్యులు గురువారం ఆర్థిక సాయం అందజేశారు. రూ. పది వేల రూపాయలను విశాఖలోని కేజీహెచ్‌కు వెళ్లి బాధితుడికి అందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు గోపి, ఉదయ్‌కుమార్, జగన్నాథం, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

భామిని : వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్న నేపథ్యంలో జ్వరాలు ప్రబలుతుండడంతో స్థానిక గిరిజన సాంఘిక సంక్షేమ గురుకులంలో గురువారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి వి.సంతోషిలక్ష్మి ఆధ్వర్యంలో సిబ్బంది విద్యార్థులను పరీక్షించి, అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బిడ్డిక రవికుమార్, సీహెచ్‌ఓ భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభకు ప్రోత్సాహకం

గరుగుబిల్లి: మండలంలోని కొత్తపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రతిభావంతులైన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేసినట్లు హెచ్ఎం జి.హరికుమార్ తెలిపారు. పాఠశాల పూర్వ విద్యార్థి, దళాయివలస గ్రామానికి చెందిన గులిపల్లి వెంకటసాయి, రవికుమార్ రూ. 5 వేలు, స్థానిక మాజీ సర్పంచ్ గొట్టాపు తేజేశ్వరరావు రూ.1500 చొప్పున అందజేసినట్లు చెప్పారు. ఈ మొత్తాన్ని ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అందజేసినట్లు హెచ్ఎం చెప్పారు.

ఆత్మీయ వీడ్కోలు



రామకృష్ణను సన్మానిస్తున్న ఎంపీపీ, సహోద్యోగులు

పాలకొండ రూరల్ : ఎన్నికల సమయంలో పాలకొండ ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టిన ఎస్.రామకృష్ణకు బొబ్బిలి మండలం తెర్లాంనకు బదిలీ అయింది. దీంతో ఆయన్ను సహచర ఉద్యోగులు, సిబ్బంది కార్యాలయం ఆవరణలో గురువారం సత్కరించారు. స్థానిక ఈఓపీఆర్‌డీ కె.సూర్యానారాయణకు ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా అధికారులు బాధ్యతలు అప్పగించారు. కార్యక్రమంలో ఎంపీపీ బొమ్మాళి భాను, వైస్ ఎంపీపీ కె.సూర్యపకాష్, ఎల్.విశ్వేశరరావు పాల్గొన్నారు.



భామిని: మండల పరిషత్ కార్యాలయంలో జెండా వందనం కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ శాంతి కుమారి, తదితరుల



సీతంపేట: ఏపీటీడబ్ల్యూఆర్ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థుల నృత్యం



పాలకొండ: ఆర్డీఓ కార్యాలయంలో గాంధీజీ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఆర్డీఓ వెంకటరమణ



పాలకొండ: జెండాకు సెల్యూట్ చేస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్



పాలకొండ రూరల్: నక్కలపేటలో షిర్డీసాయిని జాతీయ జెండాతో అలంకరించిన వైనం

వాడవాడలా మువ్వన్నెల రెపరెపలు..

సమరయోధుల పోరాట బలం... త్యాగధనుల త్యాగఫలం.. వెరసి బ్రిటీష్ పాలకులపై ఎనలేని విజయం సాధించిన రోజు ఆగస్టు 15. మాతృభూమి స్వేచ్ఛ, స్వాతంత్ర్యం కోసం అశువులు బాసిన సమరయోధుల దీక్ష, దక్షతలను స్మరించుకుంటూ వాడవాడలా స్వాతంత్ర్య దినోత్సవం గురువారం ఘనంగా జరుపుకున్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, కళాశాలలు, పాఠశాలల్లో జాతీయ జెండా రెపరెపలాడింది. ప్రజాప్రతినిధులు, అధికారులు స్వాతంత్ర్య దినోత్సవం విశిష్టతను వివరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకోగా.. సమరయోధుల వేషధారణలు ఆలోచింపజేశాయి.

– పాలకొండ/కురుపాం నెట్‌వర్క్



గుమ్మలక్ష్మీపురం: ఎంపీడీఓ కార్యాలయం వద్ద పంద్రాగస్టు వేడుకల్లో పాల్గొన్న ఎంపీపీ కుంబురుక దీనమయ్య, సిబ్బంది, విద్యార్థులు



సీతంపేట: ఐటీడీఏలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ



పాలకొండ రూరల్: స్థానిక ఆర్‌సీఎం పాఠశాలలో విద్యార్థుల పిరమిడ్ విన్యాసం



గుమ్మలక్ష్మీపురం: కురుపాం ఎంపీడీఓ కార్యాలయం వద్ద జాతీయ జెండా ఎగురవేస్తున్న కురుపాం ఎంపీపీ శెట్టి పద్మావతి



గరుగుబిల్లి: స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలో శ్రీసాయినికేతన్ పాఠశాల చిన్నారులు



జియ్యమ్మవలస: అల్లువాడ పాఠశాలలో పంద్రాగస్టు వేడుకలు



గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో త్రివర్ణ పతాకానికి గౌరవ వందనం సమర్పిస్తున్న ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి



పాలకొండ రూరల్: ఎండీడీఓ కార్యాలయంలో జెండాకు వందనం చేస్తున్న ఎంపీపీ భాను, అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులు



కొమరాడ: మండల పరిషత్‌కార్యలయంలో జాతీయ జెండాకు గౌరవ వందనం సమర్పిస్తున్న ఎంపీపీ శెట్టి శ్యామల, కార్యాలయ సిబ్బంది



కొమరాడ: విక్రంపురంలో సచివాలయం వద్ద జెండా ఎగురవేసిన సర్పంచ్ కళింగి శైలజ, తదితరులు



గరుగుబిల్లి: ఎంపీడీఓ కార్యాలయంలో జాతీయ పతాకానికి వందనం సమర్పిస్తున్న ఎంపీపీ రామారావు, కార్యాలయ సిబ్బంది

అనాథలకు అన్నదానం



చిన్నారులకు భోజనం స్వయంగా వడ్డిస్తున్న ఎస్సై ప్రశాంత్‌కుమార్

పాలకొండ రూరల్ : మండలంలోని అన్నవరం గ్రామ సమీపంలో గల అనాథాశ్రమం చిన్నారులకు స్థానిక ఎస్సై ఎస్. ప్రశాంత్‌కుమార్ అన్నదానం చేశారు. ఎస్సై తన సిబ్బందితో కలిసి గురువారం సాయంత్రం అనాథాశ్రమానికి చేరుకుని చిన్నారులతో మమేకమయ్యారు. ఆటపాటలతో సందడి చేశారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పిల్లలతో కలిసి జరుపుకున్నారు. ఈ క్రమంలో మిఠాయిలు పంచిపెట్టారు. రాత్రి భోజనం ఏర్పాటు చేసి స్వయంగా వడ్డించారు. పిల్లలతో కలసి భోజనం చేశారు. అనాథాశ్రమానికి సహకారం అందిస్తానని నిర్వాహకులకు తెలిపారు.

• తాగునీరు అందించండి..



ఖాళీ బిందెలతో నిరసన తెలియజేస్తున్న మహిళలు

పాలకొండ రూరల్: పట్టణ నడిబొడ్డున ఉన్న గారమ్మ కాలనీలో దాహం కేకలు వినిపిస్తున్నాయి. తాగునీరు అందక ఇబ్బంది పడుతున్నామని చెబుతూ ఖాళీ బిందెలతో గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ.. తాగునీరు అందకపోవడంతో పాటు రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, వీధి దీపాలు వెలగడం లేదని చెప్పారు. అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరారు.

రక్తదానం



రక్తదానం చేస్తున్న యువత

కొమరాడ: గుమడ పంచాయతీ సీతామాంబపురం గ్రామానికి చెందిన యూత్ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గురువారం రక్తదానం చేశారు. స్థానిక యూత్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. బొబ్బిలి బ్లడ్ బ్యాంక్ సిబ్బంది వచ్చి రక్తాన్ని సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రక్తదానం మహాదానమని, రక్తదానం చేయడం వల్ల ఇతరుల ప్రాణాలను కాపాడటమే కాకుండా మనం కూడా ఆరోగ్యంగా ఉంటామన్నారు. ప్రతి ఒక్కరూ అపోహలు వీడి రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత..

సీతంపేట: దోనుబాయి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మెయింటెనెన్స్ పనులు చేపట్టనున్న నేపథ్యంలో పలు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ గోపాలకృష్ణమూర్తి, ఏఈ నీలిమ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని పేర్కొన్నారు.

క్రీడలతో మానసిక వికాసం

• ఎంపీపీ బొమ్మాళి భాను



క్రికెట్‌లో గెలిచిన వారికి బహుమతి అందజేస్తున్న నాయకులు, అధికారులు

పాలకొండ: క్రీడలు మానసిక వికాసానికి దోహదం చేస్తాయని ఎంపీపీ బొమ్మాళి భాను అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో క్రీడల్లో విజేతలుగా నిలిచిన సచివాలయ ఉద్యోగులకు బహుమతులు పంపిణీ చేశారు. పది రోజులుగా మండలంలోని సచివాలయ ఉద్యోగులకు పలు క్రీడల్లో పోటీలు నిర్వహించారు. క్రికెట్, చెస్, క్యారమ్స్, వ్యాసరచన, వాలీబాల్, షటిల్ వంటి క్రీడల్లో సచివాలయ సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కనపాక సూర్యప్రకాశరావు, గండి రామినాయుడు, కర్నేన అప్పలనాయుడు, జాడ శ్రీధర్, లోలుగు విశ్వేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ఫిల్టర్ వితరణ



వాటర్ ఫిల్టర్‌ను అందజేస్తున్న ఎస్ఎంసీ చైర్మన్ దీప

గుమ్మలక్ష్మీపురం: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మండలంలోని గుణద గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు అదే పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్‌గా ఎంపికైన కద్రక దీప గురువారం వాటర్ ఫిల్టర్‌ను వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలకు స్వచ్ఛమైన తాగునీరు అందివ్వాలనే ఉద్దేశ్యంతో వాటర్ ఫిల్టర్‌ను అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

దోమ కాటుతో మూగజీవాలకు ముప్పే..



గుమ్మలక్ష్మీపురం: అనేక వ్యాధులకు కారణం దోమలే. ముఖ్యంగా వర్షాకాలంలో ఇంటి పరిసరాల్లో, ఖాళీ స్థలాల్లో చేరిన మురుగునీరు దోమలకు ప్రధాన ఆవాసంగా మారుతుంది. అందులో దోమలు పెద్ద సంఖ్యలో గుడ్లు పెట్టి తమ సంతతిని పెంచుకుంటాయి. దోమ కాటు వల్ల మలేరియా, డెంగీ వంటి ప్రాణాంతక వ్యాధులు వ్యాప్తి చెందుతాయి. దోమ కాటుతో మనుషులే కాదు మూగజీవాలకూ ఇబ్బందే. దోమల నుంచి మూగజీవాలను కాపాడుకునేందుకు పాడిరైతులు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. లేని పక్షంలో పశువుల ఆరోగ్యం క్షీణించి, పాల దిగుబడి పడిపోతుందని గుమ్మలక్ష్మీపురం పశువైద్యాధికారి పి.లక్ష్మణరావు హెచ్చరిస్తున్నారు. పశువుల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు.

ఈ సమస్యలొస్తాయి..

- దోమకాటు వల్ల పాల దిగుబడి తగ్గుతుంది.
- మేత సరిగా తీసుకోలేవు. ఆకలి మందగిస్తుంది.
- మేత తినకపోవడంతో పశువులు బలహీనంగా తయారవుతాయి.
- పశువులు జ్వరం బారిన పడతాయి. పశువుల శరీర ఉష్ణోగ్రత అధికంగా పెరిగిపోతుంది.
- చర్మం దురద వచ్చి పుండ్లు పడుతుంది.

ఈ జాగ్రత్తలు తీసుకోవాలి..

- పశువులను పాక లేదా షెడ్డులోనికి తరలించే ముందు దోమలు లోపలికి వెళ్లకుండా చూడాలి.
- పశువులను షెడ్లు/పాకలో కట్టేసిన తరువాత దోమ తెరలు కట్టి తెరకు రంధ్రాలు లే కుండా (పడకుండా) చూడాలి.
- సాయంత్రం వేప ఆకుతో పొగ పెట్టాలి.
- పశువులను కట్టే పాక/షెడ్డు చుట్టూ గుబురు పొదలు లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలి.
- పశువులను కట్టేసే ప్రదేశాన్ని సిమెంటుతో ఫ్లోరింగ చేసుకోవాలి. తద్వారా పశువుల కాళ్ల వద్ద మురుగు, వ్యర్థాలు నిల్వ ఉండవు.
- షెడ్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేసి, మంచి నీటితో కడగాలి. తద్వారా వచ్చిన నీరు కాలువల్లోకి మళ్లించాలి.
- పశువుల వ్యర్థాలు, అవి తినగా వదిలేసిన మేత నిల్వ ఉంచకూడదు. ప్రాంగణాన్ని శుభ్రం చేసుకోవాలి.
- పశువులకు నీటిని అందించే కుడితి తొట్టెల్లో నీటిని నిల్వ ఉంచకుండా శుభ్రంగా ఉండేలా చూడాలి.
- పాక/షెడ్డుల్లో మేత వేసేందుకు గాడి ఎక్కువ లోతులో ఉంచకూడదు. మూడు అడుగుల కన్నా ఎక్కువగా లోతులో గాడి ఉంచితే మేతలో దోమలు చేరి పశువులు మేత తినే సమయంలో వాటిని బాధిస్తాయి.
- కేవలం అరడుగు నుంచి అడుగు లోతు, రెండు అడుగుల వెడల్పు మాత్రమే మేత గాడి ఉండేలా చూడాలి.
- దోమల వల్ల ఎలాంటి నష్టం జరగకుండా పశుపోషకులు అప్రమత్తంగా ఉండాలి. జ్వరం, అలర్జీ, దోమ కాటుల నుంచి పశువులను సంరక్షించుకోవాలి. లేని పక్షంలో రైతులు ఒక్కోసారి పెద్ద మొత్తంలో నష్టపోవాల్సి ఉంటుంది.

ఇన్‌చార్జ్ పీఓగా పాలకొండ ఆర్డీఓ

సీతంపేట: ఐటీడీఏ ఇన్‌చార్జ్ ప్రాజెక్ట్ అధికారిగా పాలకొండ ఆర్డీఓ వీవీ రమణను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇంతవరకు ఇక్కడ పనిచేసిన ఐటీడీఏ పీఓ టి.రాహుల్‌కుమార్ రెడ్డికి పశ్చిమగోదావరి జిల్లా జేసీగా బదిలీ అయిన విషయం తెలిసిందే. ఈ స్థానంలో ఇంతవరకు ఎవరినీ నియమించలేదు. ఈ నేపథ్యంలో ఆర్డీఓకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించినట్లు ఐటీడీఏ అధికారులు గురువారం తెలిపారు.